క్లుప్తంగా

ప్రత్యేకాకర్షణగా రంగవల్లులు



పెనుగంచిప్రోలు: మండల ప్రజలు సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ముందు మహిళలు రంగవల్లులు దిద్ది పూలు, గొబ్బెమ్మలతో అలంకరించారు. కుటుంబసభ్యులు, బంధుమిత్రులు అందరూ కలిసి పిండివంటలతో సందడి చేశారు.

బహుమతులు అందజేత



వత్సవాయి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వత్సవాయిలో మంగళవారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, సీఐటీయూల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఏఎస్ఐ రమేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సంక్రాంతి అంటే నేడు కోడి పందేలు, గుండాట, పేకాటగా మారిందని, ఈ పరిస్థితిలో మార్పు రావాలని సూచించారు. సీపీఎం జిల్లా పార్టీ సభ్యులు చిరుమామిళ్ల హనుమంతురావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పర్వదినాన్ని దాని విశిష్టతను నేటితరానికి తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బి.రాము, ఐద్వా నాయకురాలు జి.పద్మ పాల్గొన్నారు.

వైభవంగా గోపూజ మహోత్సవం



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీసంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో కనుమ సందర్భంగా గోపూజ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గోపూజ విశిష్టతపై వేదపండితులు జ్యోతిష్య ప్రవీణులు శ్రీరంగం శేషాచార్యులు భక్తులకు వివరించారు. ఆలయ అర్చకులు శ్రీరంగం శ్రీనివాసచార్యులు స్వామి, అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వాయినాలు పంపిణీ

జగ్గయ్యపేటఅర్బన్ : కనుమ రోజున తెలుగు సంస్కృతి ప్రతిబింబించేలా మహిళలు వేడుకలు నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ చారుగుండ్ల కొండ సతీమణి చారుగుండ పద్మావతి పాల్గొని మహిళలకు పండ్లు, వాయినాలు పంచుకునే కార్యక్రమం చేపట్టారు.

ఆత్మీయ సమ్మేళనం



చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని చిల్లకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999–2000 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చదువుకున్న నాటి సంగతులను గుర్తుచేసుకుని సంబరపడిపోయారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు పొందారు. పండుగ రోజున ఇలా అందరూ కలుసుకోవటం సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తంచేశారు.

ఘనంగా శ్రీరామనేని వర్ధంతి

నందిగామటౌన్: డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీరామనేని సాయి, శ్రీరామనేని శ్రీనివాసరావు అందించిన సేవలు మరువలేనివని నాయకులు సయ్యద్ ఖాశీం, నారాయణ పేర్కొన్నారు. మండలంలోని కమ్మవారిపాలెంలో బుధవారం వారి వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీరామనేని సాయి స్థూపం, శ్రీనివాసరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయి, శ్రీనివాసరావు ఆశయ సాధనకు కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామనాయకులు శ్రీరామనేని లక్ష్మీనారాయణ, పత్తిపాటి శ్రీనివాసరావు, సత్యనారాయణ, నవీన్, కిషోర్, సాంబ పాల్గొన్నారు.

గ్రామాల్లో కనుమ శోభ

జగ్గయ్యపేట: మండలంలో బుధవారం కనుమ పండుగ సందర్భంగా గోపూజలతో గ్రామాలు కళకళలాడాయి. రైతు కుటుంబాలు గోవులను పసుపు, కుంకుమలతో పూజించి ఈ ఏడాది కూడా పాడిపంటలతో కళకళలాడాలని ఆకాంక్షించారు. వేదాద్రి, తిరుమలగిరి గ్రామాలలోని యోగానంద లక్ష్మీ నరసింహస్వామి, వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామివారి ఆలయాలలో కనుమ సందర్భంగా గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు గోవులను పూజించారు. ఆలయ సిబ్బంది, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా 'బరి' తెగింపు

- మూడురోజుల్లో చేతులు మారిన కోట్ల రూపాయలు
- అర్ధరాత్రి వరకు జోరుగా కోడిపందేలు, పేకాట
- షేర్‌మహ్మద్‌పేటలో ఘర్షణ
- ఇద్దరికి గాయాలు
- లాఠీచార్జి చేసిన పోలీసులు



వత్సవాయిలో ఉత్కంఠగా సాగుతున్న కోడిపందేలు

జగ్గయ్యపేట: సంప్రదాయం ముసుగులో సంక్రాంతి పండుగ సందర్భంగా మూడురోజులపాటు జగ్గయ్యపేట నియోజకవర్గంలో అధికార కూటమి నేతలు యథేచ్ఛగా కోడిపందేలు నిర్వహించారు. జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో పండగ పేరుతో కోడిపందేలు, పేకాట, గుండాట, లోనాబయట, బాక్స్‌గేమ్, చిన్నబజారు..పెద్దబజారు వంటి జూద క్రీడలను రాత్రింబవళ్లు నిర్వహించారు. జగ్గయ్యపేట మండలంలోని అనుమంచిపల్లి, గరికపాడు సమీపంలోని జాతీయ రహదారి పక్కనున్న ఖాళీ స్థలంలో జూదం యథేచ్ఛగా సాగింది. ఈప్రాంతం నుంచే కాకుండా తెలంగాణలోని కోదాడ, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, నార్కెట్‌పల్లి ప్రాంతాల నుంచి కూడా పెద్దఎత్తున పందెగాళ్లు తరలివచ్చారు. తిరుమలగిరి, తొర్రకుంటపాలెం, బలుసుపాడు, షేర్‌మహ్మద్‌పేట అడ్డరోడ్డు వద్ద కోడి పందేలతోపాటు పేకాట జోరుగా సాగింది. పండుగకు సొంతూళ్లకు వచ్చినవారిలో పలువురు జూదక్రీడల్లో పాల్గొని రూ.లక్షల్లో పోగొట్టుకుని లబోదిబోమంటున్నారు.



తిరుమలగిరి వద్ద రాత్రివేళలో వేస్తున్న కోడిపందేలు



గరికపాడు వద్ద యథేచ్ఛగా సాగుతున్న గుండాట

చేతులు మారిన రూ.కోట్లు..

మూడురోజులుగా సాగిన ఈ కోడిపందేలు, పేకాట, ఇతర జూదక్రీడల ద్వారా నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు చేతులు మారాయి. నిర్వహణ ఖర్చుల పేరుతో ఆయా బరుల నిర్వాహకులు లక్షలాది రూపాయలను దండుకుంటున్నారు. భోగి పండుగ ఉదయం నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు మూడురోజులపాటు కోడి పందేలు, జూద క్రీడలను నిర్వహించారు. బరుల వద్ద ప్రత్యేక టెంట్‌లతో పాటు ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేసి పందేలు సాగించారు. అధికారపార్టీ నేతల అండదండలతో ప్రభుత్వ పరోక్ష మద్దతుతో ఈ కోడిపందేల బరులు నిర్వహించడంతో పోలీసులు సైతం చేసేదేమిలేక మిన్నకుండిపోయారు. కొన్ని బరుల వద్ద సాక్ష్యాత్తూ పోలీసులు కూడా జూద క్రీడల్లో పాల్గొనడం గమనార్హం.

బరి వద్ద ఘర్షణ..ఒకరికి గాయాలు..

జగ్గయ్యపేట షేర్‌మహ్మద్‌పేట అడ్డరోడ్డు సమీపంలో కూటమి నేతలు ఏర్పాటు చేసిన కోడి పందేల బరి వద్ద బుధవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో పోలీసులు, ప్రజల మధ్య వాగ్వాదం జరగడంతో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. షేర్‌మహ్మద్‌పేటకు చెందిన కొందరు యువకులు మంగళవారం ఉదయం కోడి పందేలు చూసేందుకు రాగా, వారిని నిర్వాహకులు బరిలోకి అనుమతించకపోవడంతో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. దీంతో కక్షపెట్టుకున్న యువకులు బుధవారం సాయంత్రం సమయంలో మరలా బరి వద్దకు వెళ్లడంతో మళ్లీ ఘర్షణ జరిగింది. నిర్వాహకులు, యువకులు ఒకరిపై ఒకరు కర్రలు, రాళ్లతో దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సీఐ వెంకటేశ్వరరావు అక్కడకు చేరుకుని లాఠీచార్జి చేసి రెండువర్గాలను చెదరగొట్టే యత్నం చేశారు. ఘర్షణలో గాయపడిన ఇద్దరిని చికిత్సనిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



పెనుగంచిప్రోలు మామిడితోటల్లో స్క్రీన్లు ఏర్పాటు చేసి మరీ నిర్వహిస్తున్న పేకాట

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: సంక్రాంతి పండగ సందర్భంగా మూడురోజులుగా మండలకేంద్రం వత్సవాయి, మంగొల్లు, లింగాల గ్రామాలలో కోడి పందేలను నిర్వహించారు. మంగొల్లు, లింగాలలో గ్రామాలకు దూరంగా పొలాల మధ్య, మామిడితోటలలో పందేలను నిర్వహించగా వత్సవాయిలో మాత్రం పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో కోడి పందేలను యథేచ్ఛగా నిర్వహించారు. వత్సవాయి మండలం తెలంగాణకు సరిహద్దుగా ఉండడంతో ఖమ్మం, నల్గొండ జిల్లాలకు చెందిన పందెంరాయుళ్లు ఎక్కువగా తరలివచ్చారు. ఆయా పందేల బరులు తిరునాళ్లను తలపించాయి. కోడి పందేలతోపాటు గుండాట, పేకాటను యథేచ్ఛగా నిర్వహించడం గమనార్హం.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: సంక్రాంతి మూడురోజులపాటు పెనుగంచిప్రోలు మండలంలో జూదం, పేకాట జోరుగా సాగాయి. పలుచోట్ల మద్యంమత్తులో పలువురు ఘర్షణకు దిగారు. పెనుగంచిప్రోలు మామిడి తోటలో నిర్వహించిన పేకాట, ఇతర జూదాల్లో కోట్లాది రూపాయిలు చేతులు మారాయి. కూటమి నేతల కనుసన్నల్లో యథేచ్ఛగా జూదం నిర్వహించారు. రెవెన్యూ, పోలీసు అధికారులు ఆవైపు కన్నెత్తి చూసే సాహసం కూడా చేయలేకపోయారని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. పెనుగంచిప్రోలుతో పాటు నవాబుపేటలో కోడి పందేలు ఇతర జూదాలు యదేచ్ఛగా సాగాయి. మొత్తమ్మీద ఈ కోడిపందేలు, పేకాట తదితర జూదాలు కొందరికీ ఆనందాన్ని, మరికొందరికి విషాదాన్ని మిగిల్చాయి.



వత్సవాయిలో కోడిపందేల బరి వద్ద సాగుతున్న గుండాట



తొర్రకుంటపాలెం వద్ద నిర్వహిస్తున్న కర్ణాటకకు చెందిన బాక్స్ గేమ్



షేర్‌మహ్మద్‌పేటలో ఇరువర్గాలకు సర్దిజెబుతున్న సీఐ వెంకటేశ్వరరావు



ఘర్షణలో గాయపడిన యువకుడు

మిన్నంటిన సంక్రాంతి శోభ



పేట: పాతగడ్డపేటలో సాంస్కృతిక ప్రదర్శనలను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు



షేర్‌మహ్మద్‌పేటలో బహుమతులు అందజేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కృష్ణ

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట నియోజకవర్గంలో సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలకు ఘనంగా జరుపుకున్నారు. ముత్యాల ముగ్గులు, గంగిరెద్దుల విన్యాసాలతో గ్రామాల్లో సంక్రాంతి శోభ మిన్నంటింది. బంధుమిత్రుల రాకతో ఇళ్లన్నీ కళకళలాడాయి. ఆయా గ్రామాల్లో కబడ్డీ, ముగ్గుల పోటీలు, మొకులాగుడు పోటీలతోపాటు సంప్రదాయ కోడి పందేలు నిర్వహించారు.

షేర్‌మహ్మద్‌పేటలో..

మండలంలోని షేర్‌మహ్మద్‌పేటలో సంక్రాంతి పండగ సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, కబడ్డీ, క్రికెట్, సటిల్, క్యారమ్స్, చెస్, వ్యాసరచన, మొకులాగుడు తదితర పోటీలను నిర్వహించారు. గ్రామస్తులు ఆయా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ బహుమతులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎస్.నాగమణి, వెంకటేశ్వర్లు, కోట కృష్ణ, గౌస్‌మియా, రవికుమార్, లింగారావు, తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: సంక్రాంతి సందర్భంగా తిరుమలగిరి వెంకటేశ్వర స్వామి వారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేదాద్రిలోని యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాలను భక్తులు పెద్ద సంఖ్యలో సందర్శించి స్వామివార్లకు పూజలు చేశారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి పండుగను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల లోగిళ్లను అందమైన రంగవల్లులతో అలంకరించారు. వేకువజామునే ఆయా ఆలయాలలో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. జుజ్జూరు గ్రామంలో మేడికొండూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: సంక్రాంతి పండుగ పర్వదినాన్ని మండల ప్రజలు సంబరంగా జరుపుకున్నారు. బంధుమిత్రులతో గ్రామాలు కళకళలాడాయి. ఇళ్ల ముందు మహిళలు పోటీలు పడి ముగ్గులను వేశారు. రంగులతో అందంగా ముగ్గులను అలంకరించి గొబ్బెమ్మలను పెట్టారు. పండగ సందర్భంగా ప్రజలు గ్రామాల్లోని ఆలయాలను సందర్శించి పూజలు చేశారు.

మిన్నంటిన సంక్రాంతి సంబరాలు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. సంక్రాంతి, కనుమ పండుగలను జగ్గయ్యపేట పట్టణ ప్రజలు మంగళ, బుధవారాల్లో ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. బంధువులు, మిత్రుల రాకతో ఇళ్లన్నీ కళకళ లాడాయి. ఇళ్లముంగిళ్లను మహిళలు అందమైన రంగవల్లులతో తీర్చిదిద్దారు. హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలతో పట్టణం ఒక్కసారిగా పల్లె వాతావరణాన్ని తలపించింది. చిన్నారులు గాలిపటాలు ఎగురవేస్తూ కేరింతలు కొట్టారు.

పాతగడ్డపేటలో..

పాతపేటగడ్డపై బుధవారం పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నారులకు బోగిపళ్లు, బోగిమంటలు, రంగవల్లుల కార్యక్రమం, గంగిరెద్దుల విన్యాసం, హరిదాసుల సంకీర్తనలు, కోలాట బృంద నృత్యాలు, కోడి పుంజులాట, గొర్రెపొట్టేళ్ల ఆటలు, సుగాలీల సాంప్రదాయ నృత్యం, సంగీత విభావరి పలువురిని అలరించాయి. . సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించిన కళాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం శ్రీరఘురాం హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డులో గ్రామీణ వాతావరణాన్ని తలపించేలా వివిధ కార్యక్రమాలను ఏర్పాటుచేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు. సంక్రాంతి పండగ అన్నివర్గాల ప్రజల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, మాజీ వైస్ చైర్మన్ నూకల కుమార్ రాజా, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు తుమ్మేపల్లి నరేంద్ర, మానేపల్లి బ్రహ్మం, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.



సంక్రాంతి సంబరాల్లో గంగిరెద్దుల విన్యాసాలు



చిన్నారులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, నెట్టెం శ్రీరఘురాం, నాయకులు

కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



గ్రామకన్వీనర్ దమ్మాలపాటి సత్యనారాయణను సత్కరిస్తున్న నాయకులు


గంద్రాయి(జగ్గయ్యపేట):అసత్య హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ మోసాలను వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని గంద్రాయిలో బుధవారం రాత్రి చిల్లకల్లు సమితి మాజీ అధ్యక్షులు కనపర్తి శేషగిరిరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తన్నీరు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయని ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని ఎద్దేవా చేశారు. ప్రశ్నిస్తామన్న పవన్‌కళ్యాణ్ కూడా హామీలు నెరవేర్చని ముఖ్యమంత్రిని ప్రశ్నించడం లేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల కాలంలోనే కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలనను గాలికొదిలి కక్ష సాధింపులకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. అనంతరం గ్రామ పార్టీ గ్రామ కన్వీనర్ దమ్మలపాటి సత్యనారాయణతోపాటు పలు సంఘ విభాగాల కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బూడిద నరసింహారావు, విజయవాడ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం పాలక వర్గ సభ్యులు నంబూరి రవి, గ్రామనాయకులు గుమ్మా వెంకటేశ్వర్లు, సిరికొండ వెంకటేశ్వర్లు, బండి రాజు మాడుగుల బాబురావు, మార్తి నరసింహారావు, నీలం కృష్ణ, కొత్తపల్లి సురేష్, పుల్లంశెట్టి పద్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు

పోటీల నిర్వహణ అభినందనీయం

నందిగామటౌన్: సంక్రాంతి పండుగ సందర్భంగా యువత అసాంఘీక క్రీడలపై దృష్టి సారించకుండా సంప్రదాయ క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని సీఐ వైవిఎల్ నాయుడు పేర్కొన్నారు. మండలంలోని దాములూరులో పండుగ సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీల విజేతలకు మంగళవారం ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ పేరుతో అసాంఘీక క్రీడలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కబడ్డీ పోటీల నిర్వాహకులను అభినందించారు. ఈ పోటీలకు 12 గ్రామాలకు చెందిన జట్లు పాల్గొనగా మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన జట్టు ప్రథమ బహుమతిని గెలుచుకుంది. దాములూరు యంగ్‌స్టార్స్ జట్టు ద్వితీయ, రెబల్ స్టార్స్ జట్టు తృతీయ బహుమతులు గెలుచుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్ గాదెల రామారావు, నాయకులు చల్లా తులసీరావు, నేలవెల్లి సిద్ధార్థ, గాదెల వీరబాబు, పుల్లారావు, కృష్ణారావు, నరసింహారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కనులపండువగా కల్యాణోత్సవం

నందిగామటౌన్: సంక్రాంతి పర్వదినాన్ని నందిగామ నియోజకవర్గ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉద్యోగ, వృత్తి రీత్యా ఆయా ప్రాంతాలలో స్థిరపడిన వారు పండుగ సందర్భంగా స్వగ్రామాలకు తరలిరావడంతో ఆయా గ్రామాలతో పాటు పట్టణంలో రెండురోజులుగా సందడి వాతావరణం నెలకొంది. మహిళలు తమ ఇళ్లలోగిళ్లను పలు రకాల రంగులతో శోభాయమానంగా రంగవల్లులు దిద్ది గొబ్బెలను పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. పండుగ సందర్భంగా ప్రజలు ఆయా ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని ముక్కోటి మహా మండపంలో జరుగుతున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా మండపంలోని చెన్నకేశవ స్వామి వారికి విశేష పూజలు చేశారు. అనంతరం భూనీలా సమేత లక్ష్మీచెన్నకేశవస్వామి వారిక దివ్య కళ్యాణాన్ని అర్చకులు, వేద పండితులు మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ కనులపండువగా సాగింది. వైష్ణవాలయాలలో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అర్చనలతోపాటు శాంతికల్యాణాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా దేవదాయ శాఖాధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



నందిగామలో చెన్నకేశవస్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

జోరుగా మట్టి అక్రమరవాణా

భీమవరం(వత్సవాయి): మండలంలోని భీమవరంలో పేదల ఇళ్లస్థలాల కోసం సేకరించిన భూముల్లోని మట్టిని కొందరు వ్యక్తులు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నా రెవెన్యూ, మండల పరిషత్‌శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని భీమవరం సర్వేనంబరు 158లో సుమారు ఏడెకరాల ప్రభుత్వభూమిని పేద ప్రజల ఇళ్లస్థలాల కోసం సేకరించారు. పేదలకు అక్కడ స్థలాలు ఇస్తే తనకు ఇబ్బంది అంటూ గ్రామానికి చెందిన తెలుగుదేశంపార్టీ సానుభూతిపరుడైన ఓరైతు కోర్టుకు వెళ్లి స్టే తీసుకురావడంతో పేదలకు ప్లాట్ల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. ఈక్రమంలో ప్రభుత్వం మారడంతో ఇళ్లస్థలాల ప్లాట్లకు తోలిన గ్రావెల్‌ను అక్రమార్కులు జేసీబీల ద్వారా యథేచ్ఛగా తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. సదరు ప్లాట్లలో మట్టిని అమ్ముతున్నారని రెవెన్యూ, మండల పరిషత్ అధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోవడం లేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట్ల వెంకటరెడ్డి తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

